


# పరదేశీ కథలు

## – చిట్టే సిద్ధ లలిత



-84-

## బానిస బ్రతుకులు

**అటు అలలతో** నిండిన అగాధ జలనిధులు రా రమ్మని పిలుస్తున్నాయి. ఇటు దుమ్ము, ఇసుకతో కూడిన అంతులేని ఎడారి చేతులు సాచి ఆహ్వానిస్తోంది. మామా పెట్టే బాధలు భరించేదానికంటే అటు సముద్రంలో మునిగి చావడమో, ఇటు ఎడారిలోకి పారిపోవడమో మంచిదనిపిస్తోంది.

అటూ ఇటూ చూసింది సరోజ. కద్దామాలందరూ (పనిమనుషులు) ఎవరి పనుల్లో వాళ్ళు హడావిడిగా తిరుగుతున్నారు. కువైట్ వాళ్ళందరూ టీ, కాఫీలు తాగుతూ కబుర్లలో మునిగిపోయి వున్నారు.

రెండేళ్ళ పిల్లోడు అహ్మద్ పిల్లలతో కలిసి ఇసుకలో ఆడుతున్నాడు. వాడిని కంటికి రెప్పలా కాపాడాలి. వాడి పనులన్నీ చూసుకోవాలి. అదే తన పని. కానీ వాడు కింద పడినా, కాస్త ఏడ్చినా, మామా ఒప్పుకోదు. తిడుతుంది, కొడుతుంది. నానా హింసలూ పెట్టి బాధిస్తుంది.

ఆమె కొట్టిన దెబ్బలతో, పాశాలతో తన వళ్ళంతా కమిలిపోయి గదుములు కట్టి వుంది. గాయాలు బాధతో సలుపుతున్నాయి. కాంట్రాక్ట్ ప్రకారం రెండేళ్ళ కాలం పూర్తికాకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ వీళ్ళు ఇంటికి పంపించరు. ఇప్పటికి ఎనిమిది నెలలు భారంగా గడిచాయి. ఇంకో సంవత్సరం పైగా గడపాలనుకుంటేనే గుండె వణికిపోతోంది. ఈ బాధలు భరించడం కన్నా చనిపోవడం మేలనిపిస్తోంది.

ఎడారిలోకి పరిగెత్తి పారిపోతే.. ఆ ఊహే బాలేదన్నట్లుగా తలవిదిలించింది సరోజ. అంతంలేని ఎడారిలో దారీ తెన్ను తెలియదు. ప్రాణాలతో బయటపడటం జరగదు. ఆ ఎండకు మాడి మసై పోవడమే జరుగుతుంది. ప్రాణంతోనే గద్దలు, రాబందులు పొడుచుకుని తింటాయి. ఆ చావు ఘోరంగా వుంటుంది. తలచుకుంటేనే భయమేస్తోంది. వద్దు. ఆ పని చెయ్యద్దు.

మరి ధైర్యం చేసి ఈ సముద్రంలో దూకేస్తే చాలా బావుంటుంది. కొద్ది నిముషాల్లో ఊపిరి ఆగిపోయి ప్రాణం

పోతుంది. తనకు ఏ బాధా తెలియదు.  ఒక నిర్ణయానికి వచ్చినట్లు నిశ్చింతతో గట్టిగా గుండెలనిండా గాలి పీల్చుకుంది.

ఇంతలో సరోజా అంటూ మామా కేకేసింది. ఆలోచనల్లో కూరుకునిపోయి వున్న సరోజ ఉలిక్కిపడింది. ఒక్కుదుటున లేచి "చెప్పండి మామా" అంటూ ఆమె ముందుకు పరిగెత్తింది.

"అహ్మద్ కి ఆహారం తినిపించకుండా మొద్దులా కూచున్నావు. వేళకి పిల్లోడికి అన్నం పెట్టాలనేది కూడా తెలియదా". గుడ్లురిమి చూసింది మామా.

ఇంకాసేపు అలాగే వుంటే మీదపడి కొడుతుందేమో అనిపించి భయపడింది సరోజ.

నిజమే తన ఆలోచనలతో అహ్మద్ సంగతే మరిచేపోయింది. గిన్నెలోని ఆహారాన్ని అందుకుని ఆడుకుంటున్న అహ్మద్ దగ్గరికి పరిగెత్తింది. చాలా అందంగా, పాలబుగ్గలతో ముద్దుగా వున్నాడు అహ్మద్.

చందమామలాంటి వాడి ముఖం చూడగానే అన్ని బాధలనూ మరిచిపోతుంది సరోజ. వాడికి కూడా సరోజ అంటే చాలా ఇష్టం. ఈ ఎనిమిది నెలల్లో చాలా దగ్గరై పోయాడు.

సరోజ కాసేపు కనబడకపోతే వెతుక్కుంటాడు. ఆమె ఏడుస్తుంటే కన్నీళ్ళు తుడుస్తాడు. పిల్లల ప్రేమ స్వచ్ఛమైనది. ఆ ప్రేమ అన్ని బాధలనూ మరిపిస్తుంది. మామా పెట్టే బాధలన్నిటినీ పిల్లోడు అహ్మద్ చూపించే ప్రేమతో కాస్త మరిచిపోగలుగుతోంది సరోజ. కానీ మామాలో వున్న శాడిజం ఒక్కోసారి శృతిమించి పోతోంది.  రాను రానూ ఆ నరకాన్ని భరించే శక్తి సరోజలో నశించిపోతోంది. ఏదో చెయ్యాలి. ఈ నరకకూపం నుండి తప్పించుకోవాలి.

ఇక్కడనుండి మామా చేతిలోనుండి ప్రాణాలతో బయటపడటం అసాధ్యం. అందుకే చావే ఈ సమస్యకు పరిష్కారం. అంతే. గట్టిగా నిర్ణయించుకుంది సరోజ.

అహ్మద్ కి తినిపించి నోరు తుడిచింది. వాడు మరలా ఆటల్లో మునిగిపోయాడు. సరోజ యథాప్రకారం తన ఆలోచనల్లో మునిగిపోయింది. ఉన్నట్లుండి అహ్మద్ ఏడవడంతో ఉలిక్కిపడింది సరోజ.

అహ్మద్ పిన్ని కొడుకు హమ్మూది వీడిని కొడుతున్నాడు. ఆపడానికి పరిగెత్తింది సరోజ. ఈ లోపల మామా వచ్చేసింది.

"ఏం చేస్తున్నావే నువ్వు కళ్ళుతెరుచుకునే నిద్రపోతున్నావా" అంటూ రాక్షసిలా సరోజ మీద పడి జుట్టుపట్టుకుని రెండు చెంపలనూ వాయించింది.

పెదవి చిట్లి రక్తం కారుతున్నా కొట్టడం ఆపలేదు మామా. రక్తంతో బట్టలు తడిసిపోయాయి.

ఆమె స్నేహితురాళ్ళు వచ్చి విడిపించి మందలించేదాకా పిచ్చిదానిలా అలా ఇష్టమొచ్చినట్లు సరోజను కొడుతూనే వుంది మామా.

శక్తి సన్నగిల్లిపోయి ఇసుకలో కుప్పగూలిపోయింది సరోజ. పిల్లోడు అహ్మద్ సరోజ దగ్గరికి వచ్చి ఏడుస్తున్నాడు. అంతే తెలుసు. ఆ తరువాత స్పృహ తప్పింది సరోజకు.

మామా మెంటల్ కండిషన్ బాలేదట. ఆమెకు మొదట ఒక ఆడబిడ్డ పుట్టి వారం రోజుల తరువాత చనిపోయేసరికి అప్పటినుండీ ఆమె ఇలా హిస్టీరిగ్గా మారిందట. ఈ సంగతిని మామా చెల్లెలింట్లో పనిచేసే పిలిప్పీనో పనిమనిషి జూలీ చెప్పింది. ఏది ఏమయినా ఏదో ఒకరోజు మామా చేతిలో ప్రాణం పోవడం ఖాయం. సరోజకు ఈ సంగతి బాగా అర్థమయింది.

నీరసంతో వళ్ళు తూలిపోతున్నా, కాళ్ళు తేలిపోతున్నా, గాయాలు సలుపుతున్నా పని మాత్రం తప్పదు. ఎన్ని పనులున్నా పిల్లాడిని మాత్రం జాగ్రత్రగా చూసుకోవడం ముఖ్యం. పిలిప్పీనో పిల్ల జూలీ ఒక రొట్టె ముక్కను తెచ్చి పెట్టింది. ఆకలిగా వున్న సరోజ ఆ రొట్టెను ఆత్రంగా తినేసింది. కాసిన్ని టీ నీళ్ళు కూడా కడుపులో పడటంతో కాస్తంత ఓపిక వచ్చింది. మామా కొట్టిన ప్రతిసారీ ప్రాణం పోయినంత పనవుతోంది. ఎలా ఈ నరకం నుండి తప్పించుకోవడం. తీవ్రంగా ఆలోచిస్తోంది సరోజ.

"రేపునెలలో మనం ఫ్రాన్స్ కి వెళుతున్నాం తెలుసా" గుసగుసగా చెప్పింది జూలీ పక్కనే నిలబడుతూ.

"నిజమా.." ప్రశ్నించింది సరోజ అనాసక్తిగా.

"అవును. మా మామా మీ మామా ఇంకా వీళ్ళ అమ్మ ఫామిలీతో కలిసి సెలవులను సరదాగా గడపడానికి వెళుతున్నారు. మనం కూడా వెళుతున్నాం" చెప్పింది మెరిసే కళ్ళతో జూలీ.

"ఎక్కడికిపోయినా మనకు చాకిరీ తప్పదు. అదనంగా నాకు మా మామా చేత దెబ్బలు తప్పవు. జీవితమింతే." నిట్టూర్చింది సరోజ.

"హహహా" నవ్వింది జూలీ.

నవ్వుతున్న ఆమెవైపు చిత్రంగా చూసింది సరోజ.

"సరోజా జాగ్రత్తగా విను. మనం ఫ్రాన్స్ కి వెళుతూనే అక్కడ నేను వీళ్ళనుండి తప్పించుకుని పారిపోతున్నాను. నువ్వు కూడా నాతో వస్తే తీసుకుపోతాను.మన పాస్పోర్టులు ఫ్రాన్స్ నదిలో విసిరి పారేసి మనం హాయిగా ఏదో పని చేసుకుని స్వేచ్ఛగా బ్రతకొచ్చు. అక్కడ జీవితం స్వర్గంలో వున్నట్లుగా చాలా బావుంటుంది. మనకు సహాయం చేసేందుకు అక్కడ నాకు స్నేహితులు వున్నారు" చెప్పింది జూలీ.

"అమ్మో మామా నుండి తప్పించుకుని పారిపోవడమా. అది సాధ్యమా. దానికంటే చనిపోవడం సులభం" అంది సరోజ గుండెలమీద చేయి వేసుకుంటూ.

"భయపడవద్దు. ఈ కువైట్ లో మనం తప్పించుకుని ఎక్కడికీ పోలేము. ఒక్కసారి వీళ్ళతోపాటూ వేరే దేశంలోకి

వెళ్ళాక అక్కడనుండి పారిపోయామంటే వీళ్ళు అక్కడ పరదేశంలో మనల్ని ఏమీ చెయ్యలేరు. వీళ్ళు ఆ దేశాన్ని విడిచి తిరిగి వెళ్ళిపోయేంతవరకూ మనం అక్కడ చాటుగా దాక్కుంటే చాలు. ఫ్రాన్స్ లో నా ఫ్రెండ్స్ చాలామంది వున్నారు. మనకు కొద్దిరోజులు వసతిని వాళ్ళు కల్పిస్తారు. నా స్నేహితులు చాలామంది అలానే తెలివిగా పారిపోయారు. ఇప్పుడు యూరప్ దేశాల్లో స్థిరపడి మంచి ఉద్యోగాలు చేసుకుంటూ సంతోషంగా జీవిస్తున్నారు. వీళ్ళ దగ్గర బానిసల్లా, పనిమనుషుల్లా తిట్టించుకుంటూ, కొట్టించుకుంటూ ఎన్నాళ్ళు బ్రతుకుతాం. ఇదే మనకు తగిన సమయం. ఈ ఛాన్సును ఎట్టిపరిస్థితుల్లోనూ జారవిడుచుకోవద్దు. ఈ విషయం ఎక్కడా ఎవరికీ తెలియనివ్వద్దు. నువ్వు రడీగా వుండు. అంతా నేను చూసుకుంటాను" స్థిరంగా చెప్పింది జూలీ.

ఇంతలో గారపళ్ళు కనబడేలా నవ్వుతూ బెంగాలీ డ్రైవర్ అక్కడికి వచ్చాడు. "ఏంటి ఇద్దరూ పని మానేసి గుసగుసలాడుకుంటున్నారు. మామాతో చెప్పమంటారా" అని బెదిరించాడు.

వాడొక మృగం. వాడంటే ఇద్దరికీ భయమే. వెళ్ళి మామాకు చాడీలు చెప్పి కొట్టిస్తాడు. అందుకే "అబ్బే ఏమీ లేదులే" అంటూ ఇద్దరూ చెరోవైపుకు వెళ్ళిపోయి పనిలో పడిపోయారు.

జూలీ చెప్పిన విషయమే మనసులో మెదిలి అలజడి రేపెడుతోంది. తప్పించుకుని పారిపోవడమా. తనకంత ధైర్యమా. మామాను తప్పించుకుని పారిపోవడమనేది జరుగుతుందా. కలవరపడుతోంది సరోజ.

"హేయ్ జిడ్డు మొహమా. ఏ పని చేసినా అంతసేపు చేస్తావు. ఎంతసేపూ ఆలోచిస్తూ వుంటావు. తొందరగా కదులు" మీదపడి కొట్టినంత పని చేసింది మామా.

పరధ్యానంగా వున్న సరోజ మామా మాటలతో బెదిరిపోయింది. భయపడి చేతిలో వున్న గాజు గ్లాసును వదిలేసింది. అది కిందపడి భళ్ళున పగిలి ముక్కలయింది.ముక్కలయిన గాజు గ్లాసును చూసిన మామా కోపంతో వళ్ళు మరిచిపోయింది. ఆగ్రహంతో కాలికున్న చెప్పును తీసుకుని సరోజను ఎడా పెడా వాయించేసింది. భయంతో షాక్ లోకి వెళ్ళిపోయింది సరోజ. కొట్టి కొట్టి అలసిపోయాక చెప్పును సరోజ ముఖాన విసిరికొట్టి వెళ్ళిపోయింది మామా.

ఆ రాత్రి వళ్ళు తెలియని జ్వరం వచ్చింది సరోజకు. కలవరింతలతో ఉలిక్కిపడుతూ కాలం గడిపింది. తన దుస్థితికి దు:ఖం పెల్లుబికి వచ్చింది.ఈ పరదేశంలో పట్టించుకునే వారెవరూ లేరు. చచ్చిపోయినా ఎవరికీ తెలియదేమో. ఎవరూ లేని ఒంటరితనం. విడిపించుకోలేని బానిసత్వం. ఏ జన్మలో చేసుకున్న పాపమో ఇది. ఖర్మ కాకపోతే ఏమిటిది?

రగిలే హృదయంతో రాత్రంతా రోదిస్తూ వుండిపోయింది సరోజ. కనీసం పలకరించే దిక్కు కూడా లేకుండా పోయింది. ఇలా ఇక్కడే వుంటే ప్రాణంతో వుండటం అసాధ్యం. ఎలాగైనా ప్రాణాన్ని దక్కించుకోవాలి. గట్టిగా

నిశ్చయించుకుంది సరోజ.

అనుకున్నట్లుగానే ఒకరోజు అందరూ ఫ్రాన్స్ కు ప్రయాణమయ్యారు. ఫ్లైట్ ఎక్కగానే జూలీ సరోజ వైపు చూసి కన్నుగొట్టి బొటనవేలు పైకెత్తి చూపుతూ నవ్వింది.

భయపడింది సరోజ.

ఫ్రాన్స్ లో ఫ్లైట్ దిగి హోటల్ రూంస్ కి వెళ్ళగానే "నేనెప్పుడు పిలిస్తే అప్పుడు నువ్వు నాతోపాటూ వచ్చెయ్యి. మా ఫ్రెండ్స్ వచ్చి మనల్ని దూరంగా తీసుకెళ్ళిపోతారు." గుసగుసలాడింది జూలీ.

భయంగా చూసింది సరోజ.

"భయపడకు. ఒకసారి ధైర్యం చేస్తే ఇక జీవితమంతా సంతోషమే. ఇకనుండీ ఈ బాధలు నరకయాతన మనకు వుండవు. మనం స్వేచ్ఛగా జీవించవచ్చు" చెప్పింది జూలీ.

రెండ్రోజులు గడిచాయి. మూడోరోజు మధ్యాహ్నం పిల్లలనూ , పనిమనుషులిద్దరినీ రూములో వుంచి అందరూ షాపింగ్ కి వెళ్ళారు.

"ఇదే మనకు సరైన సమయం. నా ఫ్రెండ్స్ కు ఫోన్ చేసి రమ్మని చెబుతాను. మనం జంప్ అయిపోవచ్చు. హహ్హహ్హా" సంతోషంగా నవ్వింది జూలీ.

అహ్మద్ నిద్రపోతున్నాడు. ఒకసారి వాడి మొహం లోకి చూసింది సరోజ. నిద్రలేచి తనకోసం వెతుక్కుంటాడేమో. ఎలా?

"పిల్లల్ని వదిలేసి ఎలా వెళతాం" ఆందోళనగా ప్రశ్నించింది జూలీని.

"హూ కేర్స్. పిల్లలు నిద్ర పోతున్నారుగా. రూం తలుపువేసి వెళ్ళిపోదాం. మామా వాళ్ళు సాయంత్రానికి ఎటూ వస్తారు. మనకెందుకు. మన పిల్లలా వీళ్ళు. ఇవన్నీ పట్టించుకుంటే ఇక్కడే చిక్కుకుపోయి చస్తాం" కాస్త కోపంగా చెప్పింది జూలీ. అయోమయంగా వుంది సరోజకు.

పిల్లవాడిని వదిలి వెళ్ళాలంటే మనసు ఒప్పుకోవడం లేదు. వాడు తనకు బాగా అలవాటై పోయాడు. తను లేకపోతే, నిద్ర లేచాక కనబడకపోతే ఏడుస్తాడేమో. అలా అనుకుంటేనే, తలచుకుంటేనే కన్నీళ్ళొచ్చాయి సరోజకు.

"వద్దులే జూలీ నువ్వెళ్ళిపో. అహ్మద్ ను విడిచి నేను రాలేనులే" చెప్పింది కన్నీళ్ళతో.

"హేయ్ సెంటిమెంటల్ ఫూల్.. అటువైపు స్వర్గపు ద్వారాలు తెరిచి వుంచితే ఈ నరకంలో వుంటానంటావేంటి. నీకు బుద్ది వుందా. మామా మరోసారి కొడితే నీ ప్రాణం గాల్లో కలిసి పోతుంది గుర్తుంచుకో. నా మాట విని నాతో వచ్చెయ్యి. భూమ్మీద నాల్రోజులు బతికి వుంటావ్" కోపగించుకుంది జూలీ.

నిస్సహాయంగా చూసింది సరోజ.

ఇంతలో జూలీ ఫ్రెండ్స్ రానే వచ్చారు.  వాళ్ళని చూడగానే బ్యాగు అందుకుని "సరోజా కమాన్ నీ బ్యాగు తీసుకో. తొందరగా ఇక్కడినుండి పారిపోదాం" తొందరచేసింది జూలీ.

అహ్మద్ ను చూస్తూ అడుగు కదల్చలేకుంది సరోజ. వాడు నిద్రలేచి తనను వెతుక్కుంటాడన్న ఊహే ఆమెను కలవరపెడుతోంది.

"ఉహు.. నో జూలీ. నువ్వెళ్ళు. అహ్మద్ ను విడచి నేను రాలేను. చనిపోయినా పరవాలేదు." స్థిరంగా చెప్పింది సరోజ.

"నీ ఖర్మ. నేను పోతున్నాను ఫో" అంటూ బయటికి పరిగెత్తింది జూలీ.

తన బ్రతుకింతే. ఏదో ఒకరోజు మామా చేతిలో జీవితం ముగిసిపోతుంది. దు:ఖం పొంగుకొచ్చింది సరోజకు. మోకాళ్ళలో తలవాల్చి ఏడుస్తూ కూర్చుంది.

ఒక్కోసారి కొన్ని సంఘటనలు యాధృఛ్చికంగా జరుగుతాయి. అదే జరిగింది సరోజ జీవితంలో. అలాంటి సంఘటనే ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది.

ఆ రోజే ఫ్రాన్స్ లో జరిగిన రోడ్ యాక్సిడెంట్ లో మామా గాయపడింది. రెండుకాళ్ళు విరిగిపోయాయి. అక్కడే రెండునెలలు వుండి ట్రీట్మెంట్ ఇప్పించారు. అయినా లాభం లేకపోయింది. మామా నడవలేనిదై చక్రాల కుర్చీకి అంకితమై పోయింది.

తరువాత మరెప్పుడూ మామా సరోజ మీద కోపగించుకోలేదు.

ఈ యాక్సిడెంట్ తరువాత మామాలో మంచి మార్పు వచ్చి మనుషులమీద ప్రేమను పెంచుకుంది.

సరోజ మరో ఇరవై ఏళ్ళు సంతోషంగా అహ్మద్ ను పెంచి పెద్ద చేస్తూ అక్కడే ఆ ఇంట్లోనే  పనిచేసింది.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments